# ఇంటర్వ్యూ

## శ్రీసాయిపల్లవి

''అరె! నువ్వు సెలక్టు కాకపోవడం ఆశ్చర్యంగా వుందే?'' అన్నాడు పుణ్యమూర్తి ఆ సాయంత్రం నన్ను కలిసినప్పుడు.

ఇద్దరు నాలుగురోజులక్రితం ఓ ఇంటర్వ్యూకి హాజరయ్యారు. ఉన్న ఊర్లోనే- వాడికంటే గంట ముందు బయలుదేరి ఆఫీసుకి చేరుకున్నా. అక్కడి వాతావరణం నాకు నచ్చింది.

ఆఫీసు మూడో అంతస్థులో వుంది. దీర్ఘచతురస్రాకారంలో పేర్చివున్న సీట్లు, ఒక మూలగా మేనేజర్ గది. సెక్షన్ సెక్షన్‌కీ మధ్య అద్దాలు అమర్చారు. లోపల కంప్యూటర్ల ముందు కూర్చుని తమ పనిలో నిమగ్నమైన సీతాకోక చిలుకలు. లోపలికి వెళ్లి అందరినీ ఒకసారి తనివితీరా చూద్దామని మనసు తహతహలాడింది.

''సారీ!'' అంటూ అడ్డుకుంది రిసెప్షనిస్టు.

''ఎంత అందంగా వుంది'' అనుకోకుండా ఉండలేకపోయాను లోపలికెళుతున్న ఒకామెను చూస్తూ.

వచ్చింది ఉద్యోగం కోసమే అయినా ఈ కాసేపూ మంచి కాలక్షేపం చేస్తే బావుండుననిపించింది. ఆ ప్రదేశానికి కొత్తవాడిని కావడంతో రిసెప్షనిస్టు మాటను గౌరవించక తప్పలేదు.

ఇంటర్వ్యూలో ఏం ప్రశ్నలు వేస్తారు?

కంప్యూటర్ ఎవరు కనిపెట్టారు? ఇప్పుడేం జనరేషన్ కంప్యూటర్ వుంది అనడుగుతారా?

కంప్యూటరైజేషన్‌వల్ల ఉద్యోగాలకు గండి పడుతున్నాయన్న చర్చ సాగుతోంది? దీనిపై అభిప్రాయం చెప్పమంటారా?

ఇదివరకెప్పుడో 'నువ్వెన్ని మెట్లెక్కి వచ్చావని?' ఇంటర్వ్యూకి హాజరైన అభ్యర్థిని అడిగేవారట. అందరూ సరైన సమాధానానికి తల బాదుకుంటే తక్కున ఏదో ఒక జవాబు చెప్పిన వ్యక్తిని 'గుడ్' అని ప్రశంసించి ఉద్యోగంలోకి తీసుకునేవారట.

'అభ్యర్థి చొరవకు ప్రాధాన్యం ఇస్తారు' అని చెప్పడానికి చాలామంది ఇదే ఉదాహరణ చెప్పుకొస్తుంటారు. ఇదే ప్రశ్న నన్నడిగితే? 'ఒకటి న్నర నిముషాల లిఫ్ట్ ప్రయాణం అని చెప్పాలేమో? ఇక్ష్వాకుల కాలంనాటి ప్రశ్నలను ఇప్పుడడుగుతారా?

అందరికంటే ముందు రావడం ఇబ్బందిగా ఉంది. ఆందోళనవల్ల కాబోలు ముఖానికి చెమటలు పట్టింది. కర్చీఫ్‌తో తుడుచుకుంటూ లోపలికి తొంగి చూసాను. యవ్వనానికి లెక్కలొచ్చాయి.

నాకళ్ళు చుట్టూ తిరిగి ఒక చోట నిలిచాయి. ఆమె! నిజంగా అందంగా వుంది. ఇదే మాట ఇంకెవరితోనైనా అంటే ఒప్పుకోకపోవచ్చేమో గానీ ఆమె మాత్రం నా కళ్లకు అప్సరసలా కనిపించింది. అవతల విభాగంలో అమ్మాయి ఏదో చెప్పినట్టుంది. జవాబుగా ఈమె గలగల నవ్వుతోంది. ఎంత మధురంగా వుంది ఆ నవ్వు. గుండ్రటి మొహం. నవ్వుతుంటే తళుక్కుమంటున్న పలువరుస. బుగ్గన బుల్లిసొట్ట. ఆవిడ్ని ఎవరు కట్టుకుంటారోగానీ వాడి జన్మ ధన్యమైనట్టే.

ఈ ఉద్యోగం నాకే గనుక వస్తే మొట్టమొదట నేను సాధించవలసింది ఆమెను గెలవడమే. ఆమెను సొంతం చేసుకుంటే అంతకంటే మించిన అదృష్టం ఇంకొకటి ఉండదేమో!

పక్కన గలగల మాటలు వినిపించడంతో నా ఆలోచనలు తెగిపోయాయి. అప్పటికే దాదాపు పదిహేనుమంది వరకూ వచ్చేసారు.

''నాకంటే ముందు వచ్చేసావే'' పుణ్యమూర్తి నిలదీసాడు. ఏం సమాధానం చెప్పాలో తోచక నవ్వేసి ఊరుకున్నాను. ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళల్లో అమ్మాయిలు కూడా ఉన్నారు. ఒకసారి చూసాక మళ్లీ అటువైపు తల తిప్పాలనిపించలేదు. అందరూ పాతకాలం ఆడవాళ్ళల్లా కనిపించడమే అందుకు కారణం.

''మూడు పోస్టులున్నాయి. మనం పదిహేను మందివరకూ వున్నాం. ప్రతి ఐదుగురిలో ఒకరిని సెలెక్టు చేసుకుంటారన్నమాట.''

''అబ్బే! అలా కాదండీ. ఈ ఆఫీసుకి నాలుగైదు చోట్ల బ్రాంచీలున్నాయి. అన్నిచోట్లా వేర్వేరుగా ఇంటర్వ్యూలు జరిపి అన్ని బ్రాంచీలలో కలిపి మెరిట్ ప్రకారం ఉద్యోగాలిస్తారట.''

''ఆ! మెరిట్ ఎక్కడండీ? ఈపాటికి రికమండేషన్ అయిపోయి వుంటుంది. ఇదంతా మొక్కుబడికోసం.''

''అలా అనకండి. ఈ సంస్థ మేనేజర్ ఘటికుడు. ఎవరినీ దగ్గరకు చేరనివ్వడు. తనకి ఎవరు నచ్చితే వాళ్ళని తీసుకుంటాడు.''


''అంటే మనకి ఉద్యోగ ప్రాప్తి ఉందంటారు.''

నా ప్రక్కన కూర్చున్న ముగ్గురు కుర్రాళ్ళు చర్చించుకుంటూనే వున్నారు. పుణ్యమూర్తి గంభీరంగా కూర్చుని ఉన్నాడు. ఇంటర్వ్యూను ఎదుర్కోబోతున్న వత్తిడి అతని మొహంలో ప్రతిఫలిస్తోంది. రెండు చేతులు దగ్గరకు తీసుకుని బలవంతంగా రుద్దుకుంటున్నాడు. అతని పెదాలు కదులుతున్నాయి చాలా నెమ్మదిగా. బహుశా దైవ ప్రార్థన చేసుకుంటున్నాడనిపించింది.

నేను మళ్లీ ఇందాకటి అమ్మాయి కనబడుతుందేమోనని ఆత్రంగా వెదికాను. ఈలోపుగా ఇంటర్వ్యూకి ఒక్కొక్కరికి పిలుపు రావడం ప్రారంభమయింది. ఆ అమ్మాయి మాత్రం నాకంటపడలేదు. ఐదారు నిముషాల తరువాత నాకు అతి సమీపంగా

ఈ ఉద్యోగం నాకే గనుక వస్తే మొట్టమొదట నేను సాధించవలసింది ఆమెను గెలవడమే. ఆమెను సొంతం చేసుకుంటే అంతకంటే మించిన అదృష్టం ఇంకొకటి ఉండదేమో! పక్కన గలగల మాటలు వినిపించడంతో నా ఆలోచనలు తెగిపోయాయి. అప్పటికే దాదాపు పదిహేనుమంది వరకూ వచ్చేసారు.

కూర్చున్న రిసెప్షనిస్టు పలుకరించింది.



''మీ పేరు ఇదేనా?'' అనడిగింది.

అవును అంటూ బదులిచ్చాను. ఆమె చేతిలో అందంగా అమరిన నోకియా సెల్ ఫోను నన్ను ఆకట్టుకుంది. అంతకుమించి ఆమె రూపం కూడా.

ఈ రిసెప్షనిస్టుల్ని కంపెనీవాళ్ళు ఎక్కడ పట్టుకొస్తారోగానీ ఒక్కొక్కరూ ఒక్కో అయస్కాంతంలాంటివాళ్ళు. బిజినెస్ డీల్‌లు ఇలాంటివాళ్ళ వల్ల తక్కువ పూర్తవుతాయి. పెదాలపైన నిత్యం నవ్వులు పూయించడానికి వీళ్ళు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో? వయసును దాచుకోవడానికి, అలసటను దగ్గరకు చేరకుండా ఉంచడానికి ఏ టెక్నిక్ వాడతారో తెలుసుకోవాల్సిందే!

''సార్! ఇప్పుడు మీరు వెళ్ళండి'' తియ్యటి స్వరంతో రిసెప్షనిస్టు చెప్పడంతో లేచాను. ఇంటర్వ్యూకి అందంగా తయారై వచ్చాను. నల్లటి జీన్స్ ప్యాంట్‌పైన వైట్ షర్ట్ టక్. షేవ్ చేసిన గెడ్డం...హుందాగా లోపలకు ప్రవేశించాను. మర్యాదపూర్వకంగా అందరినీ విష్‌చేసి నన్ను కూర్చోమని చెప్పాకగానీ కూర్చోలేదు. అరుప్పర నిముషాలపాటు సాగిన ఆ ఇంటర్వ్యూలో వాళ్ళు అడిగిన ఏ ప్రశ్నకూ జవాబు తెలియని పరిస్థితి ఎదురు కాలేదు.

దాదాపు నాకు ఉద్యోగం వచ్చేసినట్టుగానే ఫీలయ్యాను. ఆఫీసులో ఆవిడ, రిసెప్షనిస్టు ఇద్దరినీ వచ్చే ముందు మరోసారి తనివితీరా చూసుకుని తిరిగొచ్చాను.

ఇప్పుడు పుణ్యమూర్తి మాటలు నాకు షాక్‌గా అనిపించాయి. ఇంటర్వ్యూలో నేను సెలెక్ట్ కాకపోవడం అటుంచి ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయానని, ఉద్యోగం రావడం కష్టమేనని చెప్పిన వాడికి పిలుపు రావడం ఆశ్చర్యంగా అనిపించింది. నేనెక్కడ పొరపాటు చేసానో అర్థం కాలేదు. రెండ్రోజుల తరువాత...

పుణ్యమూర్తిని స్కూటర్‌మీద ఆఫీసులో దిగబెట్టిన నేను కేంటీన్‌లో ఒకతనితో మాటలు కలిపాను. ఆ ఆఫీసు వాతావరణం, అక్కడి పరిస్థితులు పూస గుచ్చినట్టు చెప్పుకొచ్చాడతను.

''సాధారణంగా ఇంటర్వ్యూలు నాలుగ్గోడల మధ్య జరుపుతారు. మా ఆఫీసులో పరిస్థితి అందుకు భిన్నంగా వుంటుంది. కాంపౌండ్‌లో అడుగుపెట్టిన దగ్గర్నుంచి బయటకు వెళ్ళేవరకూ కొన్ని జతల కళ్ళు మీ ప్రవర్తనను నిశితంగా గమనిస్తాయి. మాట తీరు, నడవడిక ఉద్యోగాలకు ప్రధాన అర్హతగా ఇక్కడ భావిస్తారు'' అన్నారు.

అతని దగ్గర సెలవు తీసుకుని తిరిగొస్తుండగా గుంపులు గుంపులుగా ఆడవాళ్ళు...అప్పుడే ఆఫీసు వదిలారు.

అందులో పదిరోజుల క్రితం నన్ను మురిపించిన ఆ ఆఫీసు ఆవిడ, రిసెప్షనిస్టు కూడా నడుస్తూ కనిపించారు. ఇప్పుడు నాకు వాళ్ళవంక చూడాలనిపించలేదు. వాళ్ళిద్దరినీ గుడ్లప్పగించి చూసే నాకు రావాల్సిన ఉద్యోగాన్ని పోగొట్టుకున్నానేమో అనిపించిందా క్షణంలో.

అప్పటికప్పుడు నా ఆలోచనలన్నీ కొత్త ఉద్యోగం కోసం వెతుకులాడడం పైకి మళ్ళాయి.

''ఈసారి బాధ్యతగా మెలగాలి'' నాకు నేనే గట్టిగా చెప్పుకున్నాను.

★